మురికి నీరే తాగునీరు

- ముంపు ప్రాంతాల్లో కరెంటు కష్టాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


తాగునీరు కోసం కొండాయిలో ఒకే బావిలో పది మోటార్లు వేసిన గ్రామస్తులు

ఏటూరునాగారం: మురికి నీరే వారికి తాగు నీరు అయ్యింది. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నెలకొరిగిన విద్యుత్ స్తంభాలతో బోరు మెటార్లు పనిచేయకపోవడంతో మండలంలోని ఎలిశెట్టిపల్లి, అల్లంవారిఘణపురం, చెల్పాక, కొండాయి, మల్యాల, దొడ్ల ప్రాంతాల్లోని ప్రజలు మురికినీరు తాగుతూ జీవనం కొనసాగిస్తున్నారు. కొండాయి గ్రామం వైపు ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాలు, ఎలిశెట్టిపల్లి వైపు 22 కరెంట్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరా లేక బోరు మెటార్లు పనిచేయడం లేదు. కొండాయి గ్రామంలో సుమారు పది మెటార్లను బావిలోదించి తాగునీరుకు ఉపయోగించుకునేవారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. చేతి పంపులు, వాగునీరు, చేత బావుల్లో ఉన్న మురికి నీరు దిక్కు అయ్యింది. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.
కొండాయి గ్రామంలో వారం రోజుల నుంచి కరెంటు లేక దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఎలిశెట్టిపల్లిలో కరెంటు లేకపోవడంతో వాగునీరే తాగునీరు అవుతుందన్నారు. వరదతో ఇబ్బందులు పడిన తమకు కరెంట్ కష్టాలు సైతం వెంటాడుతున్నాయని అన్నారు. విద్యుత్ సరఫరా పునర్దరించాలని కోరుతున్నారు.

దోమలు కుడుతున్నాయి



కరెంటు లేకపోవడంతో రాత్రి వేళలో దోమల కుడుతున్నాయి. అసలే రోడ్డు మార్గం లేని గ్రామం మాది. దోమకాటుకు గురై జ్వరం వస్తుందని భయం వేస్తుంది. కరెంటు వచ్చే విధంగా చూడాలి. కనీస అవసరాలు తీర్చుకునేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. కూలిపోయిన ఇళ్లకు కరెంటు తొలగించి మా ఇళ్లకు కరెంటు ఇవ్వాలని కరెంటు అధికారులను కోరుతున్నాం.
- మహ్మద్ ఖాన్, కొండాయి

బావినీరే ఆధారం



తాగు, ఇతర అవసరాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురికి నీరే తాగాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకే బావిలో పది మెటార్లు వేసుకున్నాం. అవి కూడా వరదలో తడిసిపోయాయి. కరెంటు వస్తేనే అవి పనిచేస్తాయా లేదా అని తెలుస్తుంది. పరిస్థితి అధ్వానంగా మారింది. అధికారులు, నాయులు పట్టించుకొని కరెంట్ సమస్యతో పాటు నీటి సౌకర్యం కల్పించాలి.
- భిక్షపతి, కొండాయి

ప్రారంభమైన పోస్టుకార్డు ఉద్యమం

ములుగు: తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ అహ్మద్, ఉపాధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ములుగు, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట మండలాల యూనియన్ సభ్యులు తమ డిమాండ్లను పోస్ట్‌కార్డుల్లో రాసి సీఎం కేసీఆర్, ప్రగతి భవన్ అడ్రస్‌కు పోస్టు చేశారు. అనంతరం షఫీ అహ్మద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలలు, ఇళ్లు కట్టించి ఇవ్వాలని, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జేహెచ్ఎస్ కార్డు ద్వారా ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నేరవేర్చలేదని అన్నారు. కాగా టీజేఎఫ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు పిట్టల మదుసూధన్ , జిల్లా అధ్యక్షుడు నర్రా రఘువీర్‌లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ కొండం రవీందర్, జిల్లా కోశాధికారి బైకాని నటరాజ్, దాడుల కమిటీ చైర్మన్ జాలిగం శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం కోశాధికారి గొల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కేతిరి భిక్షపతి. సీనియర్ జర్నలిస్టులు భూక్య సునీల్‌వీరేంద్ర, కొండి మహిపాల్, రాజేందర్, యుగేందర్, సంపత్, శరత్, సృజన్, సుమన్, హరినాథ్, రాజు, రమేష్, వెంకన్న, కొమురయ్య, ప్రశాంత్, శంకర్, వెంకట్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వెంకటాపురం(కె) : వలస వచ్చిన ఆదివాసీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఆదివాసీ నవనిర్మాణసేన ఆధ్వర్యంలో తహసీల్దార్ అంటి నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజా మహేష్, రమేష్, భీమయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ప్రత్యేక పూజలు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచళ లక్ష్మీనర్సింహస్వామిని నూతనంగా బాధ్యతులు చేపట్టిన ఎస్సై రవికుమార్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు.

'పీసా'కు అనుమతి ఇవ్వాలి

వాజేడు: ఎత్తైన ప్రదేశంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ఏర్పాటు చేయనున్న పీసా గ్రామసభకు అనుమతి ఇవ్వాలని మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ వాసులు సోమవారం ఎంపీడీఓ విజయకు వినతిపత్రం అందించారు. గోదావరి వరదల మూలంగా 1986 సంవత్సరం నుంచి ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుందని తెలిపారు. ఎత్తైన ప్రదేశంలో ఇళ్లు నిర్మించుకోవడంలో భాగంగా స్థలాలను ఏర్పాటు చేసుకునేందుకు పీసా గ్రామ సభకు అనుమతి ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

వెంకటాపురం(ఎం): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అసాంఘీక శక్తులకు దూరంగా ఉండాలని ఎస్సై తాజుద్దీన్ సూచించారు. మండలంలోని లక్ష్మీదేవిపేటలో సోమవారం మావోయిస్టుల ఫోటోలతో కూడిన వాల్‌పోస్టర్లను గోడలకు అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో గ్రామంలో కొత్తవ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి కొత్త వ్యక్తులు అనుమానితంగా కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు.

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తుడుందెబ్బ జిల్లా ఇన్‌చార్జ్ ఎట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని బూటారం గ్రామాన్ని ఆ సంఘం నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. వెంటనే బాధితులను ఆదుకోవాలని కోరారు.

పంటరుణాలు ఇవ్వాలి

ములుగు రూరల్: అటవీ హక్కు పత్రాలు కలిగిఉన్న రైతులకు బ్యాంకు రుణాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్జద్‌పాషా కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందించారు. గిరిజన పోడు రైతులకు పంటరుణాలు అందకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రభుత్వం పంట రుణాలను అందించి ఆదుకోవాలని కోరారు. నాయకులు బోడ రమేష్, వాసం లక్ష్మీనర్సు, లక్ష్మయ్య, రవి, సారంగపాణి, ఎర్రమ్మ ఆ పార్టీ నాయకులు తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

నలుగురికి గాయాలు

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక నుంచి ఏటూరునాగారం వైపు కూలీలతో వస్తున్న ఆటో అల్లంవారిఘణపురం వద్ద సోమవారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ సంఘటన స్థలంలో ఉన్న ఏఎన్ఎం ఆదిలక్ష్మి 108కు సమాచారం అందించగా వారు స్పందించకపోవడంతో రొయ్యూర్ వైద్యురాలు సుమలతకు సమాచారం అందించారు. స్పందించిన ఆమె సామాజిక ఆస్పత్రి నుంచి అంబులెన్సును పంపించారు. గాయపడిన బోడ లక్ష్మి, పడిలాల దుర్గ, తాటి సరస్వతి, కర్నె నర్సమ్మలను సామాజిక ఆస్పత్రికి తరలించారు.

మెకానిక్ షాపులో చోరీ


ధ్వంసం చేసిన డబ్బా

మంగపేట: మండలంలోని కమలాపురంలో గల హెచ్‌కే జియాన్ టైర్ల పంక్చర్ షాపులో గుర్తు తెలియిన వ్యక్తులు చోరీకి పాల్పడి షాపులోని సుమారు 2.50 లక్షల విలువైన సామాగ్రిని అపహరించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. షాపు యజమాన్ని ఎస్‌డీ మోయిన్ తెలిపిన వివరాల ప్రకారం. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి 08 గంటలకు షాపు మూసేసి సామాగ్రిని చెక్కపెట్టేలో ఉంచి తాళం వేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 08 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చి చూడగా షాపులో ఉన్న చెక్కపెట్టె తెరిచి ఉందని, అనుమానం వచ్చి చూడగా చోరీకి జరిగినట్లు తెలిసిందని అన్నారు. చెక్కపెట్టేలోని రూ 60,000 విలువచేసే లారీ వీల్‌బోల్ట్ మిషన్‌తో పాటు రూ 1.90 లక్షల విలువ చేసే కార్ వీల్‌బోల్టు మిషన్, లారీ హెయిర్ జాకీలు 04, రెండు లారీ టైర్ డిస్కులు, వీల్ రేంచీల సెట్, రెండు పంక్చర్ డబ్బాలు, పంక్చర్ గ్రైండర్ తదితర సామాగ్రిని అపహరణకు గురైనట్లు వాపోయాడు. స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. కొంత కాలంగా మూతపడిన బిల్ట్ ఫ్యాక్టరీలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులే ఉంటారని స్థానికులు ఆరోపిస్తునారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి తుల రవి

మంగపేట: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి క్లోరినేషన్‌పై పంచాయతీ ప్రత్యేకధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి వహించాలని మండల ప్రత్యేక అధికారి తుల రవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్ అధ్యక్షతన సోమవారం అయా పంచాయతీల ప్రత్యేకధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కురిసన భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో అనేక సమస్యలు తలెత్తాయన్నారు. అయినప్పటికీ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. జీపీ కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ రోజువారి కూలీలతో పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించాన్నారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కాకుండా లీకేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ నెల 01, 11, 21 తేదీల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపర్చాలని సూచించారు. చేతి పంపుల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్, తాగునీటి క్లోరినేషన్ నిర్వాహణ పూర్తి వివరాలను రోజువారీగా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేమయాలని ఆదేశించారు. హరితహారం కార్యక్రమం నిర్వాహణపై పలు సూచనలు చేవారు. ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ చరణ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకధికారులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే


ఇప్పగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

వాజేడు: నాలుగు నెలలు ఓపిక పడితే రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీనే అని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మండలంలోని గోదావరి ముంపు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఇప్పగూడెం గ్రామంలోని ప్రజలతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరదలు వచ్చిన ప్రతీసారి బిక్కుబిక్కు మంటు బ్రతుకు తున్నామని, ఇంటి స్థలాలు ఇప్పించాలని గుమ్మడి దొడ్డి, ఇప్పగూడెం, సుందరయ్యకాలనీ ప్రజలు కోరారు. ఇప్పగూడెం గుట్టల పక్కన సుమారుగా 200 ఎకరాల అటవీ స్థలం ఉందని, దానిని ఇంటి స్థలాలకు ఇవ్వాలని కోరుతూ అక్కడ గుడిసెలు వేశామని, కాని అటవీ శాఖాధికారులు మొక్కలు నాటారని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన ములుగు డీఎఫ్ఓతో ఫోన్లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నగదు రూపంలో అందజేస్తామని లబ్దిదారులే ఇళ్లు కట్టుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, సీతారామరాజు, ఆదినారాయణ, జగన్నాథరాజు, రాంబబు, షాబీర్ పాషా తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

గోదావరి వరద ముంపు బాధితులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని వరద ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మండలంలోని మొర్రవానిగూడెం గ్రామ సమీపంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

సీఎం కేసీఆర్ కళ్లు తెరవాలి


కొండాయిలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క


మల్యాలలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ సంకీర్త్

ఏటూరునాగారం: భారీ వర్షంతో ములుగు జిల్లా అతలాకుతలం అయ్యి వరద కారణంగా ప్రజలు మృతిచెందుతున్నా సీఎం కేసీఆర్ కళ్లు తెరవడం లేదని ఎమ్మెల్యే ధనసరి సీతక్క మండిపడ్డారు. వరదతో నష్టపోయిన ఒక్కో ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామంలోని 350 ముంపు బాధితులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్‌డీటీ) సహకారంతో 18 రకాల నిత్యావసర వస్తువులు, లుంగీలు, చెద్దర్లు, ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జంపన్నవాగు వరద వలన వందలాది మంది సర్వస్వం కోల్పోయారన్నారు. మృతుల కుటుంబానికి రూ. 25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సీతక్క మా సంస్థకు సమాచారం ఇవ్వడంతో కావాల్సిన సరుకులను తీసుకొచ్చామని ఆర్‌డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు శ్రమించి ప్రతీ ఇంటికి సరుకులు చేరే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. అదే విధంగా ఆర్‌డీటీ సంస్థ ద్వారా మల్యాలలో బాధితులకు సరుకులను ఏఎస్పీ సంకీర్త్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా అసెంబ్లీ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బాలరాజు, ఎంపీటీసీ శ్రీలతదేవేందర్, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, నాయకులు కొప్పుల శ్రీనివాస్, వావిలాల ఎల్లయ్య, అరుణ, రాధిక, పోషయ్య, ముత్తయ్య, రవి, మధుబాబు, సులేమాన్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం: గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరించారు. ఖానాపురం మండలం నాజీతండాలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని బాదావత్ బాలకిషన్ పీఓను కోరారు. గోవిందరావుపేట ప్రాజెక్టునగర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డ్యామేజ్ అయిన పనులు ఇప్పించాలని ఎం రవి వినతిలో కోరారు. చిన్నబోయినపల్లిలో సీసీ రోడ్డు నిర్మించాలని మైపతి సంతోష్ కోరారు. 26 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి ఆయా సెక్టార్ అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రామాంజాపూర్‌లో రెండు నెలలు సర్వే

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ ప్రజల ఆరోగ్య పరిస్థితులపై గాంధీ గ్రామ్ ఆరోగ్య విద్యా బోధన శిక్షణలో భాగంగా పీజీడీహెచ్‌పీఈ చేస్తున్న సుజాత రెండు నెలల పాటు సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవి వెల్లడించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సుజాత శిక్షణలో భాగంగా రామానుజాపురం గ్రామాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని, ప్రజలు సుజాతకు సహకరించాలన్నారు. సుజాత రెండు నెలల పాటు ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం, ప్రజలకు ఆరోగ్యంపై విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. రెండు నెలల ప్రాజెక్టు పూర్తి చేసుకున్న అనంతరం గ్రామానికి సంబంధించిన సమస్యలపై తమిళనాడులోని గాంధీ గ్రామ్ ఇన్స్‌స్టిట్యూట్‌కి ప్రాజెక్టు వర్క్‌ను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ రుషిత ,డాక్టర్ భవ్య, డెమో తిరుపతయ్య, సీహెచ్ఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

ఏటూరునాగారం: అంటువ్యాధులు, విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఏఎస్పీ సంకీర్త్ వరద బాధితులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, ఏఎస్పీ సిబ్బందితో కలిసి సోమవారం కొండాయి, మల్యాల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెళ్లారు. వర్షాకాలం సీజన్ పూర్తి కాలేదని ఇంకా వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని దాంతో గ్రామాల్లో విష జ్వరాలు ప్రభలే అవకాశాలున్నాయన్నారు. విద్యుత్ సౌకర్యం లేదని ఇంకా గ్రామాల్లో దుర్వాసన వస్తోందని ప్రజలు అనారోగ్యం పాలు అవుతారని ఏఎస్పీ, ఏపీఓ వసంతరావు సూచించారు. కాగా ప్రజలు మాత్రం మేము ఇక్కడ నుంచి వెళ్లలేమని తేల్చిచెప్పారు. స్థానిక సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు కూడా పోలీసులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రాంతానికి వెళ్లడమే మంచిదని ప్రజలకు సర్పంచ్ తెలిపారు. అయినా బాధితులు వినిపించుకోలేదు. ఎస్ఓ రాజ్‌కుమార్, ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంచెత్తిన వరద కారణంగా తీవ్రంగా నష్టపోయిన మండలంలోని మల్యాల, కొండాయి గ్రామాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం రాష్ట్ర నాయకులతో కలిసి వరదముంపు ప్రాంతాలను, కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు పడడం వలన దాదాపు రెండు వేల ఇళ్లు దెబ్బతిన్నాయని, 500 ఇళ్లు పూర్తిగా నేల మట్టం అయ్యాయని అన్నారు. మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు రూ.5 లక్షలు పరిహారం అందించాలన్నారు. ఇసుక మేటలు వేసిన పొలాలకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్యాల, కొండాయి గ్రామాల ప్రజలను ప్రత్యామ్నాయంగా వేరే చోటికి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం పార్టీ కూడా వరద బాధితులకు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి నరసింహారావు, సూడి కృష్ణారెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి రెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యుడు, దావూద్, రాజేష్, శివప్రసాద్, చిన్న, రవి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని ఊరట్టం, కొత్తూరు, కన్నెపల్లి, మేడారం వరద ముంపు బాధిత కుటుంబాలకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ముంపు గ్రామాల్లోని ఒక్కో కుటుంబానికి 25 కేజీల సన్న బియ్యం, నెలకు సరిపడా సరుకులు అందించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వరద ముంపు బాధితులకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపున సాయం అందించాలని కోరినట్లు తెలిపారు. దీంతో తాము స్పందించి బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాణిశ్రీ, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, డీపీఓ వెంకయ్య, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


మాట్లాడుతున్న మమన్‌యాదవ్

ములుగు రూరల్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పట్టణ కార్యదర్శి మమన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) చేపట్టనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీతాన్, పోరిక జశ్వంత్, చైత్ర, అఖిల్, వరుణ్, సందీప్, పూర్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల చేయూత

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపీటీసీ కొండ మొగిలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు చేయూతనందించారు. బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించారు. బండి శ్రీనివాస్, కట్టెకోళ్ల వెంకటేష్, కొండ తిరుపతి, సారయ్య, సదయ్య, భీంరావు, జయపాల్‌రెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిత్వశాఖను కేటాయించాలి

ములుగు: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. బీసీ సంఘాలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, యువజన విభాగం జిల్లా కన్వీనర్ తోటకూరి శ్రీకాంత్, మండల కన్వీనర్ గుండారపు వైకుంఠం, జిల్లా నాయకులు మాచర్ల నాగేశ్వర్‌రావు, బెజ్జంకి రమణాచారి, గాజు అజయ్‌పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: నిరుద్యోగులు, స్థానికులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ఐటీడీఏ పీఓ అంకిత్ గ్రూప్ 1, గ్రూపు2, గ్రూపు 4, పుస్తకాలను లైబ్రరీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఈ పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండలంలోని నూగూరు, కర్రావానిగుంపు, ముత్తారం, మరికాల గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మంగపేట: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు సూచించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అకినేపల్లిమల్లారంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్, ఎంసీహెచ్ ఎపిడమిక్ టీం వైద్యాధికారి అనీష్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని మామిడిగూడెంలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌వీ ముత్తమ్మ, ఏఎస్ఎం సీత, హెచ్‌ఈఓ ఖాదర్ అబ్బాస్, ఏఎన్ఎం లలిత, మమత, ఎర్రమ్మ, నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రవితేజ ఆశా వర్కర్ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా కేంద్రం

వెంకటాపురం(ఎం): భారీ వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుర్గుపేటలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు అజ్మీర కృష్ణవేణినాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, నాయకులు కొత్త సురేందర్, కారుపోతుల యాదగిరి, వాసుదేవరెడ్డి, సుదర్శన్, సుమన్‌రావు, వీరేందర్, రాజ్‌కుమార్, సంతోష్, ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ పాఠశాల వార్డెన్‌కు సూచించారు. వరద ముంపుకు గురైన మండలంలోని ఊరట్టంలోని ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోకి ఏ మేరకు వరద చేరిందని ఆరా తీశారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు రాకుండా చూడాలని హెచ్ఎం రమేష్‌కు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. పాఠశాలలోని పునరావస కేంద్రంలో వరద బాధితులకు ఎన్ని రోజులు భోనం పెట్టారాని అడిగితెలుసుకున్నారు.

రూ.లక్ష విరాళం

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితుల సహాయార్థం భూపాలపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రాకు రూ.లక్ష చెక్కును సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలవేని రాంబాబు, కార్యదర్శి రాములు, నరేష్, కరుణాకర్, రాజు, శ్రీకాంత్, వినోద్, సాయి చరణ్, దేవేందర్, హేమంత్ పాల్గొన్నారు.